

రామాశాహ్

# కర్ఫ్యూ రాత్రి

స్పీకర్ అమర్చిన పోలీస్‌కారులోంచి ప్రజలకి చెప్తున్నారు పోలీస్ అధికారులు కర్ఫ్యూ విధించినట్లుగా. సాయంత్రం అరున్నరనుంచి, మర్నాడు పుదయం అరున్నర దాకా ఎవరూ బయటకి రాకూడదు.

బాబులు బద్ధకం పోగొట్టుకోడానికి జేబులోంచి బీడీతీసి వెలిగించాడు. కర్ఫ్యూకి సిద్ధమవడానికి హడావిడిగా తిరుగుతున్న జనాన్ని చూశాడు, బీడీ కాలిపోయేదాకా ఓ అయిదు నిముషాలసేపు.

బాబులుకి కర్ఫ్యూ అంటే భయంలేదు. తుపాకులు ధరించి తిరిగే సి. ఆర్. పి అంటే అంతకన్నా భయంలేదు. ఓ విధమయిన వుత్సాహం, సరదా ఆ కర్ఫ్యూ రాత్రి పోలీసులని ముప్పతిప్పలు పెట్టొచ్చు

జనవరి ఇంకా రాలేదు కాబట్టి చలి ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. ఏడున్నర అయేటప్పటికి వూరులోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా అయిపోయాయి. కరెంట్ లేదు, చిక్కటి చీకటి అంతా. అప్పుడప్పుడు తిరిగే పోలీస్ వేన్స్ హెడ్‌లైట్స్ తప్ప అంతా చీకటి

ఎనిమిదికల్లా బాబులు నెహ్రూ పనిచేసే కార్ఖానా చేరుకున్నాడు నెహ్రూ అప్పటికే ఎదురు చూస్తున్నాడు బాబులు కోసం.

"ఆలస్యంగా వచ్చావేం" అడిగాడు



మల్లాది వెంకట
కృష్ణమూర్తి

బాబులు, నోట్లో కొత్త బీడీతో.

"లేదు. ఇవాళ ఇంటికి వెళ్ళటం లేదు బాబులు" చెప్పాడు నెహ్రూ.

"ఏం?"

"కర్ఫ్యూ."

"అయితే ఏం? నేను తీసుకు వెళ్తాను. నా వెంట నిర్భయంగా రండి సార్."

"వద్దు బాబులు నువ్వు కూడా తెల్లారే దాకా ఇక్కడే వుండి పో."

పగలబడి నవ్వాడు బాబులు.

"బలే వారే మీరు. అయితే నిజంగా రారా?"

"వూహూ. రాత్రి షిఫ్ట్‌లో కూడా పని చేస్తాను. జనరేటర్ వుంది. రాత్రి షిఫ్ట్ వాళ్లు లేరు"

బాబులు నెహ్రూవంక కొద్దిగా జాలిగా చూసాడు బాబులుకి ఎందుకో నెహ్రూ అంటే ఇష్టం.

ఇష్టంకన్నా అది ఎక్కువ భాగం జాలే.

సన్నగా పీలగా వుంటాడు నెహ్రూ. నవ్వి నపుడు అందంగా కనపడ్డా, నెహ్రూ ముఖంలో విచారం కనిపిస్తూంటుంది ఎక్కువ. అన్నిటికీమించి నెహ్రూ ఎంతో మంచివాడు

బాబులుకి తెలుసు నెహ్రూలో తనలో లేని మంచితనం, అమాయకత్వం వున్నా యని. బ్రతక నేర్వనివాడు అనే అభి ప్రాయం కూడా వుంది. అప్పుడప్పుడు అయిదు, పది అప్పు యిస్తూంటాడు కూడా. తిరిగి అడగడానికి మొహమాటపడి ఇస్తే

తీసుకుంటాడు. లేకపోతే లేదు

నెహ్రూకోసం ఏం చెయ్యడానికైనా సిద్ధమే బాబులు అందుకే రోజూ నెహ్రూకి తోడుగా ఇంటిదాకా వస్తున్నాడు, ఎలా గోలా వీలుచేసుకుని

''ఇంకా షిప్ట్‌కి టైం వుంది టీ తాగుదాం వస్తావా?'' ఆహ్వానించాడు నెహ్రూ బాబులుని

ఇద్దరూ ఆ కార్ఖాన తాలూకు చిన్న క్యాంటీన్‌లోకి వెళ్ళారు. నెహ్రూ అన్నాడు టీ తాగుతూ

"ఇందాకేం జరిగిందో తెలుసా బాబులూ?''

'ఏం జరిగింది?'' అడిగాడు బాబులు ఆసక్తిగా. నెహ్రూ చాలా తక్కువ మాట్లాడతాడు మాట్లాడితే మాత్రం, క్లుప్తంగా చెప్పేది ముగించేస్తాడు. మాటలన్నీ పొదుపుగా వాడి జాగ్రత్తగా వింటే కాని తన మొద్దు బుర్రకి ఏమీ ఎక్కదని అనుభవం మీద గ్రహించాడు బాబులు

'నా ప్రక్కన పనిచేసే ఫోర్‌మేన్ భార్యని ఎవరితోనో చూసి, చావ చితక కొట్టాడు ఇద్దరినీ''

''ఎవరు, ఆ ఫోర్‌మేనా?'' అర్థం కాక అడిగాడు బాబులు

'అవును ''

'మంచి పనిచేసాడు, పొడి చెయ్యాల్సింది ఇద్దరినీ అసలు.''

'ఛ. తప్పుకదూ ''

''తప్పుచేసిన వాళ్ళని అలాచేస్తే కాని తృప్తివుండదు ఏ మగాడికయినా. పొడిచి పొడిచి చంపాలి.''

''బాబులు. నీకు చెడ్డతనం అలవాటు.''

బాబులు ఖాళీ గాజుగ్లాసు కింద పెట్టి అన్నాడు

''ధైర్యంలేని మగాళ్ళయితే నాలాంటి వాడికి సందో, రెండొందలో పారేసి పని చేయించుకుంటారు సూర్యారావు పేటలో ఆ మధ్య గొడవయి నన్ను పోలీసులుపట్టు కెళ్ళింది అందుకేగా ''

''మనిషిని మనిషి చంపటం తప్పు'' అందామనుకున్నాడు నెహ్రూ. కాని పెదవి దాట నివ్వలేదు తన అభిప్రాయాన్ని. మౌనంగా వుండి పోయాడు అలవాటుగా

''ఒకవేళ మీకే అలా అయితే ఏం చేస్తారు?''

షిఫ్ట్ మరో అయిదు నిముషాలలో మొదలవుతున్నట్లుగా గంట కొట్టారు కార్ఖానాలో అంటే వెళ్ళి మెషీన్స్ శుభ్రం చేసుకోవాలి టూల్స్ అన్నీ సర్దుకోవాలి. తయారవాలి మళ్ళీ బెల్ వినపడే లోపల.

నెహ్రూ టీకి డబ్బులు చెల్లించాడు. తన ప్రశ్న నెహ్రూకి వినపడ లేదను కున్నాడు బాబులు వెళ్తూ చెప్పాడునెహ్రూ.

"నా భార్య చాలా మంచిది ''

చిన్నగా నవ్వాడు బాబులు.

''నా భార్యకూడా నాకళ్ళ పడనంత కాలం మంచిదే అనుకున్నాను''

చిరునవ్వు నవ్వాడు నెహ్రూ

''రాత్రి జాగ్రత్త బాబులు. తిరక్క..''

''రేపు వుదయం వస్తాను అరున్నరకి.''

''రాగలిగితేనే రా.'

'మాట వరసకి అన్నాను కాని, మీ ఆవిడ మంచిదే'' అన్నాడు బాబులు తన

ఇందాక తప్పుగా మాట్లాడానని గ్రహించి.

"అవును. నా విషయంలో అలా జరగదు. జరిగితే కనకదుర్గ కొండమీద, దేవి ఆలయం ప్రక్కనే కోనేరు వుంది. కృష్ణా నది వుంది. వూరినిండా కాలవలున్నాయి."

"ఆత్మహత్యా?" ఆశ్చర్యపడ్డాడు బాబులు.

"అవును."

"అంత ఖర్మేం పట్టింది? విడాకు  "

"దేముడు కొంతమందికి ధైర్యంగా బ్రతకగలిగే శక్తి యివ్వలేదు బాబులు. కొన్ని కొన్ని సంఘటనలకి వాళ్ళు తల క్రిందు లవుతారు కాని తట్టుకోలేరు."

"అంతా మీ పిచ్చి."


"మెషిన్ ఎదురు చూస్తూంటుంది. జాగ్రత్తగా వెళ్ళు బాబులు." మరోసారి హెచ్చరించి కార్ఖానాలోకి వెళ్ళిపోయాడు నెహ్రూ.

బాబులు గేటుదాటుతూండగా రెండో గంట వినపడింది. ఎనిమిది గంటలు పని చేసి మరో ఎనిమిది గంటలు నెహ్రూ ఎలా పనిచేయగలడో అర్థం కాలేదు బాబులుకి.

బహుశ ఆరునెలల క్రితం పుట్టిన తన కొడుకుకు బంగారపు ఉంగరం చేయించే ప్రయత్నంలో వుండి వుంటాడనుకున్నాడు బాబులు. నెహ్రూ ఆరునెలల కొడుకును గుర్తు తెచ్చుకుని చిన్నగా నిట్టూర్చాడు.

తనకా ప్రాప్తంలేదు.

బాబులు, మరి కొందరు బాబులులాంటి వాళ్ళు మాత్రం తిరుగుతున్నారు విజయవాడ వీధుల్లో రహస్యంగా. చీకట్లో కలిసి పోయిన నీడల్లాగ. చేతిలో సూదులతో నింపిన సోడా బుడ్లు, కర్రలు వాళ్ల ఆయుధాలు. రోడ్ల మధ్య అక్కడక్కడ అడ్డంగా పడవేసిన దుంగలు, తారు డ్రమ్ములు



మొదలయినవి పి. ఆర్. పి. వేన్స్‌కి అడ్డంకులు.

బాబులు కురుక్షేత్రంలో అర్జునుడిలా, పద్మవ్యూహంలోని అభిమన్యుడిలా జాగ్రత్తగా సందులు దాటుతున్నాడు చకచకా. బొడ్లో నాలుగయిదు సోడా కాయలు వున్నాయి. చేతిలో పచ్చి మొద్దుకర్రవుంది.

ఎలాగయినా ఓ పోలీస్ వేన్‌నయినా తగలబెట్టాలనే పట్టుదలతో వున్నాడు బాబులు. బాబులులో ప్రాణంమీద తీపి కాని, ఏమయినా అవుతుందనే భయం కాని ఏనాడో చచ్చిపోయాయి

అందుకే ఎలాంటి పనినయినా చేయగలడు ఎవరినీ లెక్కచేయకుండా. ఒక్కొక్కసారి పోలీస్ ఇన్‌స్పెక్టర్సే బాబులు సహాయం కోరుతారు కొన్ని కేసుల్లో.

చిన్న సైజు రౌడీలు, మురానాయకులు మొదలు ఎం. ఎల్. ఏల దాకా బాబులుకి తెలుసు

కార్ఖానా వదిలిన దగ్గరనుంచి, అర్థరాత్రి పన్నెండు దాకా, షుమారు నాలుగు గంటలసేపు బాబులు తిరుగుతూనే వున్నాడు రోడ్లమీద. సోడా బుడ్లన్నీ అయిపోయాయి.

విసిగి ఇక పడుకోవాలని ఇంటికి బయలుదేరాడు. రైలు కట్టదాటి సందులోకి ప్రవేశించాడు. ఆ సందులోనే బాబులు ఇల్లు. సందు చివరవుంది. గబగబా అడుగులు వేసాడు.

కటిక చీకటిని చీల్చుకుంటూ సందుకి అవతల చివరనుంచి వస్తున్న రెండు కాంతి కిరణాలని గమనించి బాబులు చటుక్కున ఓ ఇంటి అరుగు కింద నక్కాడు కదలకుండా.

పోలీస్ వేన్ అది.

పి ఆర్. పి లతో నిండిన పెట్రోల్ వేన్ అది. బాబులు వూపిరి పీల్చటంకూడా మర్చిపోయి అలాగే కదలకుండా వుండిపోయాడు. వేన్ వెళ్లిపోయింది.

రెండు నిముషాల దాకా అలాగే వుండిపోయాడు బాబులు. 'వెధవ నాయాళ్ళు.' తిట్టుకున్నాడు మనసులోనే.

నెమ్మదిగా అరుగు కిందనుంచి లేచి, కాళ్ళకి అంటుకున్న బురదని రోడ్డుమీద రాపి వదిలించుకున్నాడు కొంత. అయినా పూర్తిగా వదలలేదు.

రెండడుగులువేసి చటుక్కున ఆగిపోయాడు బాబులు. జాగ్రత్తగా విన్నాడు.

కొద్ది కొద్దిగా మాటలు, నవ్వు వినపడుతోంది యెక్కడనుంచో చెవులు రిక్కించి విన్నాడు. సందేహంలేదు. భ్రమకాదు. నిజంగా వినపడుతున్నాయి.

ఎవరు? ఇంత రాత్రివేళ ఎవరు మేలుకుని నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకునేది? బాబులు తన ఆసక్తిని చంపుకో లేకపోయాడు. జాగ్రత్తగా గోడవైపు నడిచాడు ఆ చీకటిలో.

ఆ గోడ వెనకవున్న పెంకుటింట్లోంచి.

బాబులు భృకుటి కొద్దిగా ముడిపడింది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా వుండిపోయాడు ఏం చేయాలా అని. ఆ ఇంట్లో వుండేది ఎవరో బాబులుకి తెలుసు.

ఓ నిశ్చయానికివచ్చి, చప్పుడు చేయకుండా రోడ్డుమీదకివున్న తలుపుని తీసాడు. తెరచుకోలేదు. లోపల గడియవేసి వుంది.

ఎగిరి, రెండు చేతులతో ప్రహరీ గోడ

అంచు అందుకుని గోడ పైకి ఎక్కి. బాబులు లోపలకి జారాడు పిల్లిలా. ఎదురుగా చీకటిలో నల్లటి కాటుక కుప్పలా వుంది పెంకుటిల్లు.

కిటికీ దగ్గరకి నడిచాడు. ఇప్పుడు కొద్దిగా స్పష్టంగా వినపడుతున్నాయి. గుసగుసలు.

చెవులప్పగించి విన్నాడు.

ఆడా, మొగా కంఠాలని గుర్తించాడు. కొద్దిగా వులిక్కిపడ్డాడు బాబులు. గుండె టకటక కొట్టుకుంటోంది.

చాలాసేపు. దాదాపు పావు గంటసేపు మౌనంగా నిల్చుండి పోయాడు బాబులు కిటికీ ప్రక్కనే, గోడ కానుకుని. లోపల చీకటిగా వుండటంవల్ల ఏమీ కనబడటం లేదు. కాని యెవరో తెలుసు బాబులుకి.

బాబులు మళ్లీ గోడదాటి రోడ్డుమీదకి వచ్చాడు. బీడీ తాగాలనిపించింది. ఇంటికి వెళ్ల బుద్ధికాలేదు. రోడ్డుమీద నుంచుని బీడీతాగితే, ఏ. పి. ఆర్. పి వేన్ సందులోకి తిరిగినా తను కనపడతాడు ఆ చీకటి సందులో; బీడీ నిప్పువల్ల గుర్తించవచ్చు సందులో ఎవరో వున్నారని.

బీడీ తాగే ప్రయత్నం విరమించుకుని సందు చివరవున్న తన ఇంటివైపు రెండడుగులువేసి, బీడీ తాగాలనే కోరికని చంపుకోలేక మళ్లీ వెనక్కి తిరిగాడు బాబులు.

సందుకి ఇటుచివర ఆనుకునివున్న రైలుకట్ట దగ్గరకి చేరుకుని రైలుకట్ట ప్రక్కన మొలచి గుబురుగావున్న పిచ్చిమొక్కల మధ్య కూర్చున్నాడు బాబులు.

బీడీ వెలిగించాడు అగ్గిపుల్లగీసి. పొగ వూపిరితిత్తులలోకి వెళ్ళగానే మేధస్సు పని చేయసాగింది.

ఎంత ధైర్యం!

అసలు ఎప్పటినుంచి ఈ తతంగం?

మరో రెండుసార్లు బీడీ పీల్చాడు.

నెహ్రూ గుర్తుకువచ్చాడు. ఎంత అమాయకుడు. ఎంత మంచివాడు. లోకంలో అతి మెత్తనివాడు. ఓ విధంగా చేతకానివాడు. అంతా తనకి మంచి చేస్తారనే విశ్వాసంతో. గానుగెద్దులా పనిచేస్తూ, అందరినీ నమ్మేవాళ్ళ కీలోకంలో ఎప్పుడో ఓసారి ఎదురుదెబ్బ తగలక తప్పదు.

అది తగిలిననాడు మంచి అంతా ఇగిరిపోయి చెడ్డవాడిగా మారవచ్చు. అలా మారలేనప్పుడు.

నెహ్రూ అన్న మాటలు గుర్తుకొచ్చాయి బాబులుకి

'కనకదుర్గ కొండమీద, దేవి ఆలయం ప్రక్కనే కోనేరుంది. కృష్ణానది వుంది. వూరునిండా కాలువలున్నాయి'

నిజమే మానసిక దౌర్బల్యం ఆత్మహత్యకి పురికొల్పుతుంది.

నెహ్రూభార్య గుర్తుకువచ్చింది.

ఒకే సందుకాబట్టి. వీధి పంపు దగ్గర ఎన్నో వందలసార్లు చూసాడు బాబులు. చాలాసార్లు ఆశ పడ్డాడు కూడా. నల్లగా వున్నా, చక్కటి సౌష్ఠవంతో వుంటుంది నెహ్రూ భార్య.

నెహ్రూ మంచితనం బాబులు మనస్సులోని చెడు కోరికలని చల్లార్చింది. నెహ్రూ అంటే ఎంతో ఇష్టం బాబులుకి. కోరినప్పుడు డబ్బు ఇస్తాడనిగాదు. తనమీద భయంతో చాలామంది ఇస్తారు అలా.

నెహ్రూలా మంచితనం అంటే బాబులుకి ఇష్టం.

నెహ్రూభార్య పతివ్రతగా భ్రమపడ్డాడు తను ఇన్నాళ్ళు. కాదు. ముమ్మాటికీకాదు.

ఇప్పుడు... ఈ క్షణంలో నెహ్రూభార్య చీకటిలో, పరుపుమీద, ఎదురింటి దర్జీకొట్టు వాడి కౌగిలిలో వుంది. తను ఎదురుచూడని, కలలోకూడా అనుకోని సత్యం అది.

ఆరిపోయిన బీడీని కసిగా నలిపేసి, కొత్తబీడీ అంటించాడు బాబులు. గుండెని నిప్పుమీద కాల్చి పైన కారం చల్లినట్లుగా అనిపించింది బాబులుకి.

ఇంకా నయం. తను చూసాడు కాని నెహ్రూ చూసివుంటేనా?

రెండో బీడీ కాలిపోయేదాకా అలాగే కూర్చున్నాడు బాబులు. మనసునిండా ఆలోచనలతో. లేచి అడుగులు వేసాడు సందు వైపు. కొద్దిగా భారంగా.

తను ఎన్నోసార్లు నెహ్రూకి సహాయ పడదామనుకున్నాడు నిజమైన సహాయం- సైకిల్ మీద ఎక్కించుకుని కార్ఖానాదగ్గర ఆలస్యమయిపోతే చేర్చేపాటి చిన్న సహాయాలుకావు.

నిజమయిన మంచిసహాయం. సందు చేరుతుంటే వెనకాల చప్పుడు విని తల వెనక్కిత్రిప్పి చూసాడు బాబులు.

అంతదాకా మత్తుగావున్న చీకటిని చీల్చుకుంటూ, నిశ్శబ్దాన్ని చంపుతూ వస్తోంది గూడ్సుబండి వకటి, పట్టాలమీద వేగంగా.

బాబులు ఆగి, అలాగే వెళ్తున్న ఆ గూడ్సుబండివంక చూస్తూండిపోయాడు. చివరిపెట్టెకివున్న ఎర్రరంగు లైట్ కాంతి అదృశ్యమయ్యేదాకా.

రైళ్ళు తిరుగుతున్నాయి వుదయం నుంచి. తర్వాతి రైలు మరో గంటలో వస్తుంది. గుంటూరునుంచి మచిలీపట్నం వెళ్ళే పేసెంజర్ రావడానికి ఇంకో గంట టైం వుంది అనుకున్నాడు బాబులు.

గబగబా అడుగులువేస్తూ అనుకున్నాడు బాబులు బిగ్గరగా.

'నిజమయిన సహాయం చేయాలి. నెహ్రూ ఎప్పుడూ ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రాకుండా చేయాలి!

* * *

మర్నాడు వుదయం ఆ సందులోని వాళ్ళు, రైలుకట్టమీద, రైలుక్రింద చితికి పోయి చచ్చి పడివున్న నెహ్రూభార్యని, కొంచెం దూరంలో పడివున్న నెహ్రూభార్య కట్టుకున్నచీర పీలికలని చూసి ఏం జరిగి వుండవచ్చో వూహాగానం చేసారు.

సి. ఆర్. పి. వాళ్ళు నెహ్రూ భార్యని రేప్‌చేసి రైలుక్రింద తోసి చంపారు.

"అంతే జరిగివుండవచ్చు విచారపడకు నెహ్రూ. నేనున్నాను నీకు. నెలతిరిగేలోగా నీకో భార్య, నీకొడుకు కో తల్లికూడా వుంటారు" భరోసాగా భుజం తడుతూ ఓదార్చాడు బాబులు నెహ్రూని.

బాబులుకి క్రితం రాత్రి తన గుండెలో మొదలయిన బాధ పూర్తిగా పోయింది. తను చేయగలిగిన సహాయం చేసినందుకు.

ఆ తర్వాత ఆ పట్టాలమీద చాలారైళ్ళు పరిగెత్తాయి. ఆ రైళ్ళ చక్రాలలో ఒక చక్రానికి తెలుసు జరిగిన నిజం-మౌనంగా వుండిపోయింది. బహుశ ఆ కర్ఫ్యూ రాత్రి జరిగింది తనకి సమ్మతమే నన్నట్లుగా. ★